
సాక్షి ఖమ్మం

బుధవారం । 26 । మార్చి । 2025



ఇకపై కల్లూరు మున్సిపాలిటీ!

కల్లూరు మేజర్ జీపీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసే బిల్లును అసెంబ్లీలో ఆమోదించడంతో జిల్లాలో మున్సిపాలిటీల సంఖ్య ఐదుకు చేరనుంది. 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం సా॥) 6.27

సహర్ (గురువారం ఉ॥) 4.51

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం 39° / 21°

జిల్లాలో బుధవారం ఉదయమే ఎండ మొదలై మధ్యాహ్నానికి తీవ్రరూపం దాలుస్తుంది. రాత్రివేళ మాత్రం వాతావరణం చల్లబడుతుంది.

ఎల్‌ఆర్‌ఎస్.. అన్నా చిక్కులే

సాంకేతిక సమస్యలతో దరఖాస్తుదారుల సతమతం

- మున్సిపల్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- 31వ తేదీతో ముగియనున్న ఫీజు గడువు


ఎల్‌ఆర్‌ఎస్(లే ఔట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) చిక్కులమయంగా మారింది. ఫీజు చెల్లిస్తే ప్రక్రియ పూర్తవుతుందని భావించిన దరఖాస్తుదారులను సాంకేతిక సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. సాంకేతిక లోపాలతో సర్వర్లు మొరాయిస్తుండగా.. ఫీజు గడువు ఈనెల 31తో ముగియనుండడం వారి ఆందోళనకు కారణమవుతోంది. కొందరికి ఫీజు చెల్లించాలనే సమాచారం రాకపోవడంతో కార్యాలయాలకు వెళ్లి ఆరా తీస్తే ఐజీఆర్‌ఎస్ అని వస్తోంది. ఇంకొందరి స్థలాలు నిషేధిత జాబితాలో కనిపిస్తున్నాయి. ఈ సమస్యల పరిష్కారం ఎలాగో తెలియక అధికారులు.. ఎప్పుడు మెసేజ్ వస్తుందోనని దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం మరికొద్ది రోజులు గడువు పెంచితే తప్ప జిల్లాలో ఉన్న దరఖాస్తులకు మోక్షం లభించే అవకాశం లేదని చెబుతున్నారు. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

నాటి దరఖాస్తులకే..

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజుకు సంబంధించి ప్రభుత్వం ప్రకటించిన రాయితీ గడువు ముంచుకొస్తోంది. రాయితీని సద్వినియోగం చేసుకునేందుకు 2020 ఆగస్టు 26కు ముందు రూ.వెయ్యి కట్టిన వారు ఫీజు చెల్లించేందుకు కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. ఒకేసారి దరఖాస్తుదారుల సంఖ్య పెరగడంతో సర్వర్లు కూడా మొరాయిస్తున్నాయి. దరఖాస్తుల స్థితిని తెలుసుకునేందుకు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. జిల్లావ్యాప్తంగా 99,913 దరఖాస్తులు ఉండగా.. 61,343దరఖాస్తులు ఫీజు చెల్లింపునకు అర్హత సాధించాయి. ఇందులో 5,731 మంది దరఖాస్తుదారులే ఫీజు చెల్లించారు.

ఐజీఆర్‌ఎస్ అయోమయం

ఫీజు చెల్లించాలని మెసేజ్‌లు రాకపోవడంతో పలువురు కార్యాలయాలకు వచ్చి ఆరా తీస్తున్నారు. వీరి దరఖాస్తు నంబర్ల ఆధారంగా ఆన్‌లైన్‌లో పరిశీలిస్తే 'ఐజీఆర్‌ఎస్'(ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రెవెన్యూ అండ్ స్టాంప్స్) అనే మెసేజ్ చూపిస్తోంది. ఇదేమిటంటే.. ఐజీఆర్‌ఎస్‌లో ఉన్న దరఖాస్తులకు ఫీజు చెల్లించాలనే మెసేజ్ రాదని.. ప్రభుత్వమే ఈ సమస్యను పరిష్కరించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. అయితే, మరోవైపు రిజిస్ట్రేషన్ శాఖ నుంచి స్థల వాల్యుయేషన్ సర్టిఫికెట్ తీసుకొచ్చి అటాచ్ చేస్తే ఎంత ఫీజు చెల్లించాలనే మెసేజ్ రావొచ్చని పేర్కొంటున్నారు.



జిల్లా అంతటా అర్హత సాధించిన దరఖాస్తులు	61,343
ఫీజు చెల్లించినవి	5,731
ప్రొసీడింగ్స్ ఇచ్చినవి	2,496 (జీపీలు మినహా)
చెల్లించిన నగదు	రూ.26.27 కోట్లు (జీపీలు మినహా)



ఖమ్మం కార్పొరేషన్‌లో ఎల్‌ఆర్‌ఎస్ కౌంటర్ వద్ద దరఖాస్తుదారుల రద్దీ

అన్నీ ఉన్నా ఆ జాబితాలో..

ప్రభుత్వ స్థలాలు, ఇరిగేషన్ స్థలాలకు సంబంధించిన సర్వే నంబర్లలో ఉన్న దరఖాస్తులను ప్రభుత్వం ప్రొహిబిటెడ్(నిషేధిత జాబితా) కింద చేర్చింది. వీటిని రెవెన్యూ, ఇరిగేషన్, టౌన్‌ప్లానింగ్ అధికారులు పరిశీలిస్తే ప్రొహిబిటెడ్ వర్తిస్తుందా, లేదా అన్నది తేలనుంది. ఈ దరఖాస్తులను పరిశీలించాలంటే ఇంకొంత సమయం పడుతుంది.

ఎల్‌ఆర్‌ఎస్ కోసం వచ్చిన దరఖాస్తుల వివరాలు

ప్రాంతం	దరఖాస్తులు	పెండింగ్	ప్రొహిబిటెడ్
ఖమ్మం కార్పొరేషన్	39,999	16,388	5,550
వైరా మున్సిపాలిటీ	3,524	751	-
మధిర	4,280	147	146
ఏదులాపురం	13,496	10,002	269
సత్తుపల్లి	3,688	88	77
సుడా	20,759	2,145	740
జీపీలు	14,167	2,208	696
మొత్తం	99,913	31,729	7,478

క్షేత్ర స్థాయిలో సిబ్బంది కొరతతో ఈ ప్రక్రియ ఆలస్యమవుతోందని సమాచారం. అన్ని పత్రాలతో ఎల్‌ఆర్‌ఎస్‌కి దరఖాస్తు చేసుకున్నా తమది నిషేధిత జాబితాలో ఎందుకు పడిందని కొందరు హెల్ప్‌డెస్క్‌ల వద్ద సిబ్బందిని నిలదీస్తున్నారు.

నత్తనడకనే చెల్లింపులు

ఖమ్మం కార్పొరేషన్‌తోపాటు సత్తుపల్లి, మధిర,వైరా, ఏదులాపురం మున్సిపాలిటీల్లో ఫీజు చెల్లింపునకు 30,813 దరఖాస్తులు అర్హత సాధించాయి. ఇందులో 4,163 మందే రూ.22.42కోట్ల మేర ఫీజు చెల్లించగా, 2,416 మందికి ప్రొసీడింగ్స్ ఇచ్చారు. ఇక సుడా పరిధిలో 19,070 దరఖాస్తులు అర్హత సాధిస్తే రూ.3.85కోట్ల ఫీజు చెల్లించిన 1,357 మందిలో 80 దరఖాస్తులకు ప్రొసీడింగ్స్ ఇచ్చారు. ఇందుకు సంబంధించి రూ.3.85 కోట్లు చెల్లించారు. ఇక జిల్లాలోని గ్రామపంచాయతీల్లో ఫీజు చెల్లించేందుకు 11,460 దరఖాస్తులు అర్హత సాధించగా.. 211 మంది మాత్రమే ఫీజు చెల్లించారు. అంతా సాఫీగా ఉన్న దరఖాస్తులకు ఫీజు చెల్లింపు ప్రక్రియ నత్తనడకన కొనసాగుతుండడం గమనార్హం.

ఐజీఆర్‌ఎస్ అని వస్తోంది..



ఖమ్మం ఇల్లెందు రోడ్డులో ఎస్ఎఫ్ఎస్ స్కూల్ పక్కన ఉన్న స్థలానికి ఎల్‌ఆర్‌ఎస్ కోసం 2020లో దరఖాస్తు చేశా. నగదు చెల్లిద్దామని చూస్తే ఐజీఆర్‌ఎస్ అని వస్తోంది. కార్పొరేషన్ అధికారులను అడిగితే ఏం చేయలేమంటున్నారు. దరఖాస్తు చేసుకునే సమయాన అన్ని పత్రాలు సమర్పించా. ప్రతిరోజు మెసేజ్ వస్తుందేమోనని ఎదురుచూస్తున్నా.

– గోపినేని శ్రీధర్‌రావు, బుర్హాన్‌పురం, ఖమ్మం

నిందితులకు శిక్ష ఖరారయ్యేలా దర్యాప్తు

- ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్
- నేర సమీక్ష సమావేశంలో సీపీ సునీల్‌దత్



మాట్లాడుతున్న సీపీ, పక్కన అధికారులు

ఖమ్మంక్రైం: నేరం చేసిన వారెవరు శిక్ష నుంచి తప్పించుకోలేరనే రీతిలో దర్యాప్తు చేయడమే కాకుండా పకడ్బందీ ఆధారాలతో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఆదేశించారు. ఖమ్మంలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన నేరసమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఇటీవల పలు కేసుల్లో నిందితులకు జీవిత ఖైదు పడేలా చార్జిషీట్లు దాఖలు చేసిన అధికారులను అభినందించారు. అనంతరం స్టేషన్ల వారీగా నమోదైన కేసులు, దర్యాప్తు స్థితిగతులపై ఆరా తీశాక పలు సూచనలు చేశారు.

అక్రమాలపై నిఘా

కీలకమైన కేసుల్లో దర్యాప్తు మొదలు చార్జిషీట్ దాఖలు వరకు ప్రణాళికాయుతంగా వ్యవహరించాలని సీపీ సూచించారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో విధిగా విజిబుల్ పోలీసింగ్ అమలుచేస్తూ నేరాలను నియంత్రించాలన్నారు. గంజాయితో పాటు ఇసుక అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దని స్పష్టం చేశారు. అలాగే, పోక్సో, అట్రాసిటీ కేసుల దర్యాప్తుల్లో మరింత నాణ్యత పాటించాలని, ఐపీఎల్ జరుగుతున్న నేపథ్యాన బెట్టింగ్, నిర్మానుష్య ప్రాంతాల్లో అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా పర్యవేక్షించాలని తెలిపారు. అంతేకాక అన్ని స్టేషన్ల పరిధిలో ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్ తనిఖీలు నిర్వహించాలని సీపీ సూచించారు. ఈసమావేశంలో అడిషనల్ డీసీపీ నరేష్‌కుమార్, ట్రెయినీ ఐపీఎస్ సాయిరుత్విక్, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, రెహమాన్, రఘు, వెంకటేష్, సాంబరాజు, రవి, సర్వర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

'నవోదయ' ఫలితాలు విడుదల

కూసుమంచి: నవోదయ విద్యాలయాల్లో ఆరు, తొమ్మిదో తరగతిలో ప్రవేశాలకు ఇటీవల నిర్వహించిన అర్హత పరీక్ష ఫలితాలు వెల్లడయ్యాయి. ఈమేరకు ఫలితాలను విద్యాలయ సమితి మంగళవారం తన వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. దీంతో పరీక్ష రాసిన విద్యార్థులు తమ రోల్ నంబర్ల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. అయితే, తమకు విద్యాలయ సమితి నుండి ఇంకా జాబితా అందలేదని, వచ్చాక అర్హత సాధించిన వారి రోల్ నంబర్లు ప్రకటిస్తామని పాలేరు విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు.

'కారుణ్య' ఉద్యోగులకు విధులపై అవగాహన



మాట్లాడుతున్న సీఈఓ దీక్షారైనా

ఖమ్మంవన్‌టౌన్: కారుణ్య నియామకాల ద్వారా జిల్లా నుంచి 27మందికి అవకాశం దక్కగా ఇటీవల హైదరాబాద్‌లో ఉత్తర్వులు అందుకున్నారు. ఈమేరకు జూనియర్ సహాయకులుగా నియమితులైన వారికి జెడ్పీ హాల్‌లో మంగళవారం విధినిర్వహణపై అవగాహన కల్పించారు. జెడ్పీ సీఈఓ దీక్షారైనా పాల్గొని విధులు, సర్వీస్ అంశాలను వివరించారు. డిప్యూటీ సీఈఓ నాగపద్మజ, మినిస్టీరియల్ ఉద్యోగ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మామునూరు రాజేష్, గుప్తా, జెడ్పీ ఉద్యోగులు రమణశేఖర్, రమణ, బండి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


రూ.30.30లక్షలకు పిండిప్రోలు సంత వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలులో ప్రతీ శనివారం నిర్వహించే వారంతపు సంత ఈసారి రికార్డు ధర పలికింది. ఎంపీడీఓ సిలార్‌సాహెబ్ ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన వేలంలో రూ.50వేల చొప్పున డిపాజిట్ చెల్లించిన 90మందికి పైగా పాల్గొన్నారు. 2024–25లో రూ.14లక్షలు పలకగా.. ఈసారి వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన అప్పాల సుదర్శన్ రూ.30.30లక్షలకు దక్కించుకోవడం విశేషం. దీంతో రూ.16లక్షలకు పైగా ధర పెరిగినట్లయింది. ఏపీడీ నూరుద్దీన్, పిండిప్రోలు, తిరుమలాయపాలెం, బచ్చోడు పంచాయతీ కార్యదర్శులు రాము, సుజాత, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పంటల్లో సస్యరక్షణ చర్యలే కీలకం



మాట్లాడుతున్న బలరామ్, పక్కన అధికారులు, శాస్త్రవేత్తలు

వైరా: ఏ పంట సాగు చేసినా వాటిని ఆశించే తెగుళ్లను గుర్తించడం.. వీటిని నిర్మూలించే చర్యలే కీలకంగా నిలుస్తామని శాస్త్రవేత్తలు తెలిపారు. వైరా కృషి విజ్ఞాన కేంద్రంలోని రైతు శిక్షణా కేంద్రంలో నిర్వహిస్తున్న ఉత్తర తెలంగాణ వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘం సమావేశాలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆపత్కాల పంటల ప్రణాళికలు – అనుసరించాల్సిన వ్యూహాలను సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్‌జీ.మహదేవప్ప వివరించారు. అనంతరం సంయుక్త వ్యాధి నిర్ధారణ పరీక్షల నిర్వహణ, చీడపీడల గుర్తింపు.. ఆపై శాస్త్రవేత్తల సలహాతో నిర్మూలించడం వంటి అంశాలను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకుడు డాక్టర్ ఎం.బలరామ్ వివరించారు. ఆపై జిల్లా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు వివిధ పంటల సాగుపై చర్చించి చేయాల్సిన పరిశోధనలను నిర్ణయించారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి

ఖమ్మంవన్‌టౌన్: మిర్చి సాగు చేస్తున్న రైతులకు మద్దతు ధర దక్కేలా కేంద్రం చొరవ చూపాలని ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి కోరారు. ఈసందర్భంగా ఆయన లోక్‌సభలో మంగళవారం మాట్లాడారు. తెలంగాణలో అత్యధికంగా ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో మిరప పంట సాగవుతోందని తెలిపారు. ఈనేపథ్యాన రైతుల సమస్యలను పరిగణనలోకి తీసుకుని, వాటిని పరిష్కరించడం ద్వారా అండగా నిలవాలని ఎంపీ కోరారు.

ధాన్యం కొనుగోళ్లు సాఫీగా సాగేలా ఏర్పాట్లు

- సన్నరకం ధాన్యాన్ని అధికారులు ధ్రువీకరించాలి
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం సహకారనగర్: యాసంగి ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో మంగళవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోళ్లు విజయవంతంగా పూర్తిచేసినట్లుగానే రబీలోనూ చేపట్టాలని తెలిపారు. సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్లకు వేర్వేరు కేంద్రాలను ఏర్పాటుచేసి అవసరమైన సామగ్రి సమకూర్చుకోవాలని సూచించారు. ఎండల కారణంగా సిబ్బంది, రైతులకు వడదెబ్బ తగిలితే ప్రాథమిక చికిత్సకు ఏర్పాట్లు చేయాలన్నారు. కేంద్రాల ఇన్‌చార్జిలకు నూతన సిమ్ కార్డులు అందించి ఎప్పటికప్పుడు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ రైతులకు 48 గంటల వ్యవధిలో నగదు జమ చేయించాలని సూచించారు. ఇక సన్న రకం ధాన్యాన్ని అధికారులు పక్కాగా ధ్రువీకరించాలని, రైస్ మిల్లుకు వెళ్లాక తాలు పేరిట కోత విధించకుండా చూడాలని తెలిపారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, డీసీఓ చందన్‌కుమార్, డీఎం శ్రీలత, డీఆర్‌డీఓ సన్యాసయ్య, డీఏఓ డి.పుల్లయ్య, మార్కెటింగ్ అధికారి ఎం.ఏ.అలీం, జిల్లా సహకార అధికారి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయంలో అభ్యర్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

గ్రంథాలయంలో వసతుల కల్పనకు కృషి

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అవసరమైన వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని కలెక్టర్ ముజమ్మల్ ఖాన్ తెలిపారు. ఖమ్మంలోని కేంద్ర గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన ఆయన వాటర్ ప్లాంట్, టాయిలెట్లను పరిశీలించాక పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. అవసరమైన పుస్తకాలు లేకపోతే జాబితా సమర్పించాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే, ఈ– లైబ్రరీ ఏర్పాటుచేయాలని తెలిపారు. లైబ్రరీ కార్యదర్శి అర్జున్, లైబ్రేరియన్లు కె.రవిబాబు, బి.బాబూరావు, విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లోకి పెట్టుబడి సాయం

మరో 59 వేల మందికి రూ.60.87 కోట్లు జమ

ఖమ్మంవ్యవసాయం: రైతుభరోసా పథకం ద్వారా పంటల పెట్టుబడికి రైతుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం నగదు జమ చేస్తోంది. జిల్లాలోని 59,061 మంది రైతుల ఖాతాల్లో మంగళవారం రూ.60.87 కోట్లు జమ అయ్యాయని అధికారులు వెల్లడించారు. ఐదెకరాల మేర సాగు భూమి కలిగిన రైతుల ఖాతాల్లో నగదు జమ ప్రక్రియ కొనసాగుతోందని సమాచారం. జిల్లాలో రైతు భరోసా పథకానికి 3,51,592 మంది రైతులను అర్హులుగా గుర్తించగా. ఎకరాకు రూ.6వేల చొప్పున రూ.371.06 కోట్లు జమ కావాల్సి ఉంది. ఇప్పటివరకు 2,65,392మంది రైతులకు రూ.215.78 కోట్లు అందాయి. జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా రైతు భరోసా పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. తొలుత ఎంపిక చేసిన గ్రామాల్లో అందరు రైతులకు నగదు జమ చేయగా.. మిగిలిన గ్రామాల్లో ఎకరం భూమి మొదలు నగదు జమ చేస్తోంది. ఫిబ్రవరి 13వ తేదీవరకు మూడెకరాల లోపు భూమి కలిగిన రైతులకు పెట్టుబడి సాయం అందింది. ఆతర్వాత నిలిచిపోవటంతో రైతుల్లో సందేహాలు మొదలయ్యాయి. ఇంతలోనే ఐదెకరాల వరకు సాగు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుండగా.. ఈనెలాఖరు నాటికి అర్హులైన రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ అవుతుందని చెబుతున్నారు. జిల్లాలో ఇంకా 86 వేల మంది రైతులకు వారికి ఉన్న భూమి ఆధారంగా రూ.156 కోట్ల సాయం అందాల్సి ఉంది.



కేఎంసీ బడ్జెట్.. రూ. 188. 31కోట్లు

- సొంత నిధులతో పాటు ప్రభుత్వ నిధులపై ఆశలు
- అన్ని డివిజన్లలో రీ–అసెస్‌మెంట్ సర్వేకు నిర్ణయం
- కౌన్సిల్ భేటీలో పాల్గొన్న మేయర్ నీరజ, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- సమస్యలపై కార్పొరేటర్లు.. ప్రొటోకాల్‌పై ఎమ్మెల్సీ మధు ప్రస్తావన

ఖమ్మంమయూరిసెంటర్: రానున్న ఆర్థిక సంవత్సరానికి ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం భారీ బడ్జెట్ రూపొందించింది. రూ.188.31 కోట్లతో రూపొందించిన బడ్జెట్‌పై చర్చ, ఆమోదానికి ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ పునుకొల్లు నీరజ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ పాల్గొనగా... 2025–2026 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాలు, ఆదాయం, వ్యయం వివరా లే కాక 2024–2025 సవరించిన బడ్జెట్‌ను అకౌంట్స్ అధికారి శివలింగం ప్రవేశపెట్టారు. ప్రభుత్వ ఆదాయానికి తోడు సొంతనిధులు కలిపి భారీ బడ్జెట్ సమర్పించినట్లు పాలకవర్గం వెల్లడించింది.

ప్రాథమిక లెక్కలపై లోతుగా చర్చ

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ బడ్జెట్ ప్రాథమిక లెక్కలపై లోతుగా చర్చించినట్లు తెలిపారు. ఆస్తిపన్ను వసూలు లక్ష్యాలను చేరుకోవడమే కాక ఆస్తి పన్ను, ఇతర పన్నుల రీఅసెస్‌మెంట్‌తో ఆదాయ మార్గాలు పెంచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అర్బన్‌కు ప్రత్యేకంగా ఇద్దరు తహసీల్దార్లు, ముగ్గురు సర్వేయర్ల కేటాయింపునకు నెలలోగా ప్రభుత్వం నుంచి ఆమోదం లభిస్తుందని తెలిపారు. అలాగే, దూరదృష్టితో మాస్టర్ ప్లాన్ తయారు చేస్తున్నామని వెల్లడించారు.

ఆదాయం ఇలా.. కోట్లు (రూ.ల్లో)

ఇంటి పన్నులు	33.92
స్టాంప్ డ్యూటీ	13.00
అద్దెల ద్వారా	4.43
పారిశుద్ధ్య విభాగం	3.61
ప్రణాళిక విభాగం	36.10
ఇంజనీరింగ్ విభాగం	11.76
డిపాజిట్లు	6.76
ప్రణాళికేతర నిధులు	61.05
ప్రణాళిక నిధులు	14.75
ఇతర నిధులు	2.92



మాట్లాడుతున్న మేయర్ నీరజ, పక్కన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ శ్రీజ

విలీన పంచాయతీలపై దృష్టి..

మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ విలీన పంచాయతీల అభివృద్ధిపైనే ప్రత్యేక దృష్టి సారించాలన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలతో బడ్జెట్ కేటాయించామని తెలిపారు. రోడ్లు, డ్రెయినేజీలు లేనిచోటే నిర్మాణాలు జరుగుతాయన్నారు. వచ్చే నెల మొదటి వారం మరోసారి కౌన్సిల్ సమావేశం నిర్వహించి కార్పొరేటర్ల నుండి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని తెలిపారు.

ఆదాయం పెంపుపై దృష్టి..

కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ కార్పొరేషన్ ఆదాయం పెంచాలనే లక్ష్యంతో 43వ డివిజన్‌లో పన్నుల రీఅసెస్‌మెంట్ చేయగా రూ.60లక్షల మేర ఆదాయం పెరిగిందని తెలిపారు. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరం అన్ని డివిజన్లలో ఈ ప్రక్రియ చేపడుతామని వెల్లడించారు. నగరంలో 7వేల వాణిజ్య సంస్థలే రిజిస్టర్ కాగా.. క్షేత్రస్థాయిలో ఈ సంఖ్య చాలా ఎక్కువగా ఉందన్నారు. ఈమేరకు వ్యాపారులంతా ట్రేడ్ లైసెన్స్ తీసుకునేలా సర్వే చేస్తామని తెలిపారు. అలాగే, కేఎంసీని ఐదు జోన్లుగా విభజించే ప్రణాళికను వచ్చే కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెడతామని వెల్లడించారు.



సీటు విషయమై అసిస్టెంట్ కమిషనర్‌ను అడుగుతున్న ఎమ్మెల్సీ మధు

ప్రొటోకాల్ రగడ

కేఎంసీ కౌన్సిల్ సమావేశం ప్రారంభానికి ముందు ఎమ్మెల్సీ తాత మధుసూదన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశాలకు హాజరవుతున్నానని తెలిపినా అధికారులు సీటు కేటాయించలేదని మండిపడ్డారు. అయితే ఎమ్మెల్సీకి ప్రత్యేక సీటు కేటాయించి నేమ్ బోర్డు ఏర్పాటుచేసినా.. తొలుత వచ్చిన కార్పొరేటర్లు ఆ బోర్డును పక్కన పెట్టడం ఈ వివాదానికి కారణమైంది.

- కార్పొరేటర్ కమర్తపు మురళి మాట్లాడుతూ గ్రౌండ్ ఫ్లోర్‌కు అనుమతి తీసుకొని మూడు, నాలుగు ఫ్లోర్లు నిర్మిస్తున్న వారిని గుర్తించి ఆస్తి పన్ను వసూలు చేయాలని సూచించారు. అద్దెల కింద ఆదాయం పెంచడంపై దృష్టి సారించాలని, అనుమతులు లేకుండా ఇళ్లను గుర్తించి పన్ను లు విధించాలని తెలిపారు.
- పలువురు కార్మికులను ఔట్ సోర్సింగ్ సిబ్బందిగా గుర్తించాలని కార్పొరేటర్ బీ.జీ.క్లెమెంట్ డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్లు కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని తెలిపారు. తన డివిజన్‌లో పలు రోడ్ల విస్తరణ, అభివృద్ధి ఆవశ్యతను వివరించారు.
- కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ కేటాయించిన బడ్జెట్‌ఖర్చు చేయనందున ఆ నిధులు ఏమిచేస్తున్నారో చెప్పాలన్నారు. అంతేకాక విలీన గ్రామాలకు మరిన్ని నిధులు కేటాయించి రహదారులు, డ్రెయినేజీలు, ఇతర అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు.

నగర పరిధిలో ప్లాట్ ఇస్తేనే భూమి తీస్కోండి

ఖమ్మంఅర్బన్: మున్నేటి ముంపు నుంచి రక్షించేందుకు ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణానికి కావాల్సిన ప్రైవేట్ భూముల సేకరణపై అధికారులు దృష్టి సారించారు. ఈమేరకు ఖమ్మం అర్బన్ మండల పరిధిలోని రైతులు, ప్లాట్ల యజమానులతో మంగళవారం జల వనరులు, రెవెన్యూ శాఖల అధికారులు ఖమ్మంలోని డీపీఆర్‌సీ భవనంలో సమావేశమయ్యారు. అయితే, పలువురు రైతులు తమ భూమికి మార్కెట్ ధర ఆధారంగా పరిహారం చెల్లించాలని కోరారు. ప్లాట్ల యజమానులు మాత్రం తమకు నగర పరిధిలోనే మరోచోట ప్లాట్లు కేటాయిస్తేనే భూమి ఇస్తామని స్పష్టం చేశారు. ఇందుకు స్పందించిన అధికారులు పోలేపల్లి వద్ద లేఔట్ చేసిన వెంచర్‌లో ప్లాట్లు ఇస్తామని చెప్పగా.. నిర్వాసితులు నగర పరిధిలోనే ప్లాట్లు ఇవ్వాలని పట్టుపట్టారు. దీంతో సమావేశంలో ఏ నిర్ణయమూ ఖరారు కాలేదు. ఆర్డీఓ జి.నర్సింహారావు, తహసీల్దార్ రవికుమార్, జల వనరుల శాఖ ఈఈ అనన్య, డీఈ ఉదయ్‌ప్రతాప్, ఆర్ఐ వాహిద్‌తో పాటు రైతులు, ప్లాట్ల యజమానులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్


కవిత

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల జువాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ బుర్గుల కవితకు కాకతీయ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ ప్రకటించారు. కేయూ జువాలజీ విభాగం ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి పర్యవేక్షణలో ఆమె సమర్పించిన పరిశోధనా సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా కవితను మంగళవారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జాకీరుల్లా, జువాలజీ విభాగాధిపతి డాక్టర్ సునందతో పాటు అధ్యాపకులు అభినందించారు.

మత్స్యకారులకు కొనసాగుతున్న శిక్షణ


వలల తయారీపై శిక్షణ పొందుతున్న మత్స్యకారులు

కూసుమంచి: మండలంలోని పాలేరు శ్రీ పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో ఖమ్మం జిల్లాకు చెందిన షెడ్యూల్డ్ కులాల మత్స్యకారులకు ఇస్తున్న శిక్షణ మంగళవారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా గడ్డిపల్లి కేవీకే సీనియర్ శాస్త్రవేత్త బి.లవకుమార్ పాల్గొని జలాశయాల్లో పెంచే వివిధ రకాల చేప పిల్లల విత్తనాల ఎంపికపై అవగాహన కల్పించారు. తెలంగాణను ఆక్వా హబ్‌గా మార్చేందుకు మత్స్యకారులు అధునాతన విధానాలు పాటగించాలని తెలిపారు. అనంతరం కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్, శాస్త్రవేత్తలు శాంతన్న, రవీందర్ మాట్లాడగా వివిధ రకాల వలల తయారీపై శిక్షణ ఇచ్చారు.

మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో కాంస్యపతకం



పతకం, సర్టిఫికెట్‌తో నర్సయ్య (కుడివైపు)

ఖమ్మం స్పోర్ట్స్: గోవాలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఖమ్మంకు చెందిన రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ కె.నర్సయ్య బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో కాంస్య పతకం గెలుచుకున్నారు. గోవాలో ఈనెల 16నుంచి 23వ తేదీ వరకు పోటీలు జరగగా పతకం సాధించిన ఆయన జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ జట్టులో స్థానం దక్కించుకుని థాయ్‌లాండ్‌లో జరిగే అంతర్జాతీయ టోర్నీకి ఎంపికయ్యారు. ఈసందర్భంగా 75ఏళ్ల వయస్సులో ప్రతిభ చూపిన నర్సయ్యను బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంటా వెంకట్రావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కర్నాటి వీరభద్రం, వి.చంద్రశేఖర్‌తో పాటు జట్ల శ్రీను, సుదర్శన్ రావు, పి.రవిమారుత్, కమర్తపు మురళి, సత్యనారాయణ, బాలసాని ఆనంద్, పి.యుగంధర్, ఆర్.శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.

ప్రభుత్వాస్పత్రిలో 'కాయకల్ప' బృందం


కాయకల్ప బృందంతో ఆస్పత్రి ఉద్యోగులు

పెనుబల్లి: పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రిని కాయకల్ప బృందం మంగళవారం తనిఖీ చేసింది. ఈసందర్భంగా ఆస్పత్రి ఆవరణలో పరిశుభ్రత, వైద్యసేవలు, రికార్డుల నిర్వహణ, ఫార్మసీలో మందు లభ్యత వివరాలు ఆరా తీశారు. అలాగే, చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడుతూ వైద్యసేవలు ఎలా అందుతున్నాయో తెలుసుకున్నారు. ఈ బృందంలో డాక్టర్ ఎస్.సోమరాజు, సిబ్బంది పి.రేవతి, బి.రజిని, కె.ప్రమీల ఉన్నారని ఆస్పత్రి సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ తెలిపారు.

జీప్‌ను తగలబెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం బేతుపల్లిలో ఓ ఇంటి ముందు పార్కు చేసిన జీప్‌ను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి పెట్రోల్ పోసి దహనం చేశారు. గ్రామంలో చాంద్‌పాషా ఇంటి ముందు నిలిపిన జీప్‌పై అర్ధరాత్రి వేళ కారులో వచ్చిన కొందరు వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పంటించగా మంటలు వ్యాపించాయి. స్థానికులు గుర్తించి వచ్చేలోగా దుండగులు పారిపోయారు. ఈ ఘటనలో జీప్ పూర్తిగా కాలిపోగా, చాంద్‌పాషా మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,000	5,000
కందులు	6,800	6,800
మిర్చి	13,350	6,000
మిర్చి తాలు	5,800	4,000
పత్తి	7,200	5,800

– ఖమ్మం వ్యవసాయం

ఇకపై కల్లూరు మున్సిపాలిటీ!

- శాసనసభ సమావేశాల్లో ఆమోదం
- మండలిలో ఆమోదించాక గవర్నర్ సంతకమే తరువాయి..
- 23,484 మంది జనాభాతో ఏర్పాటు


కల్లూరు మేజర్ గ్రామపంచాయితీ కార్యాలయం

కల్లూరు: కల్లూరును మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతున్న ప్రజల కల ఎట్టకేలకు సాకారమైంది. అసెంబ్లీ సమావేశాల్లో సోమవారం కల్లూరు మున్సిపాలిటీకి సంబంధించి ముసాయిదాను మంత్రి శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టగా ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతో శాసన మండలిలోనూ ఆమోదించాక గవర్నర్ సంతకం పెడితే కల్లూరు మేజర్ గ్రామపంచాయతీ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ కానుంది. ఇదే జరిగితే జిల్లాలో ఐదో మున్సిపాలిటీ ఏర్పాటవుతుంది. ఖమ్మం కార్పొరేషన్‌కు తోడు మధిర, వైరా, సత్తుపల్లి మున్సిపాలిటీలు ఉండగా ఇటీవలే ఏదులాపురం మున్సిపాలిటీ ఏర్పాటైన విషయం విదితమే.

డిసెంబర్‌లో మంత్రి హామీ

గత ఏడాది డిసెంబర్ 21న మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ ఇంటి శంకుస్థాపనకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ కల్లూరు ప్రజల చిరకాల కోరిక అయిన మున్సిపాలిటీ అంశాన్ని ప్రస్తావించగా.. త్వరలోనే కల సాకారమవుతుందని హామీ ఇచ్చారు. ఆతర్వాతఈ ఏడాది జనవరి 3వ తేదీన పంచాయతీ ఈఓ నందిశెట్టి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో మెజారిటీ ప్రజలు మున్సిపాలిటీ ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. దీంతో అసెంబ్లీలో ముసాయిదా ప్రవేశపెట్టగా ఆమోదం లభించింది.

ఆ గ్రామాలు మళ్లీ...

పరిపాలనా సౌలభ్యం కోసం 2018లో కల్లూరు, ఖాన్‌ఖాన్‌పేట, శ్రీరామపురం, జీడీబీపల్లి మినహా కప్పలబంధం, తూర్పు లోకవరం, పడమర లోకవరం, కిష్టయ్యబంజర్, పుల్లయ్యబంజర, హనుమా తండా గ్రామాలను విడదీసి కొత్త పంచాయతీలుగా ఏర్పాటుచేశారు. కల్లూరు, శ్రీరామపురం, ఖాన్‌ఖాన్‌పేట, జీడీబీపల్లి గ్రామాల్లో 18,170 మంది జనాభా ఉండగా, సుమారు 13,500 మంది ఓటర్లు ఉంటారు. అయితే, మున్సిపాలిటీ ఏర్పాటుకు కనీసం 20 వేల మంది జనాభా అవసరం కావడంతో పూర్వం విడిపోయిన ఆరు గ్రామాలే కాక వాచ్యా నాయక్ తండాను కూడా కలపనున్నాయి. దీంతో 23,484 మంది జనాభాతో కల్లూరు మున్సిపాలిటీగా అవతరించనుంది. ఈ మేరకు ఆయా గ్రామాల్లో తీర్మానాలు చేసి ఇప్పటికే కలెక్టర్‌కు నివేదికలు పంపించారు.

కలెక్టరేట్‌కు నివేదిక



మున్సిపాలిటీగా మారనున్న నేపథ్యాన కల్లూరు పంచాయతీలో గ్రామసభ నిర్వహించగా మెజారిటీ గ్రామస్తులు ఆమోదం తెలిపారు. అంతేకాక విలీనం కానున్న గ్రామాల్లోనూ సభలు నిర్వహించి కలెక్టరేట్‌కు నివేదిక పంపించాం.

– ఎస్.నాగేశ్వరరావు, ఈఓ

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన


సైకిళ్లు అందుకున్న విద్యార్థులతో డీఈఓ, తదితరులు

చింతకాని/వైరా రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించడమే కాక నాణ్యమైన బోధన అందిస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ తెలిపారు. చింతకాని మండలంలోని మత్కేపల్లి ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10మంది విద్యార్థులకు వైరా మండలం అష్టగుర్తికి చెందిన సువిధ వికాస్ ట్రస్ట్ సమకూర్చిన సైకిళ్లను మంగళవారం ఆయన అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతో పాటు దాతల చేయూతను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థానాలకు చేరాలని సూచించారు. అలాగే, వైరా మండలం రెబ్బవరం జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఏడుగురికి సువిధ ట్రస్ట్ బాధ్యులు సైకిళ్లు అందించారు. ఈకార్యక్రమాల్లో ఎంఈఓలు వీరపనేని శ్రీనివాసరావు, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్లు బొల్లికొండ మంగమ్మ, ఆకుల లలిత, ఇన్‌చార్జ్ హెచ్‌ఎంలు అనిత, గంగవరపు వెంకట్రావు, ఉపాధ్యాయులు గండేపల్లి శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, సురేష్, నాగమణి, హసీనా, సమ్మయ్య, దొడ్డా వరప్రసాద్, జీ.వీ.సూర్యప్రకాష్, ట్రస్ట్ బాధ్యులు అమరనేని మన్మథరావు, వేంసాని వెంకట్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

'బార్' ఎన్నికలకు ఊపందుకున్న ప్రచారం




వెంకటేశ్వర గుప్తా వెంకటేశ్వరరావు విజయరాఘవ

ఖమ్మం లీగల్: ఖమ్మం బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం జరగనుండగా ప్రచారం ఉధృతంగా సాగుతోంది. బరిలో నిలిచిన అభ్యర్థులు తమ విజయాన్ని కాంక్షిస్తూ న్యాయవాదులను వ్యక్తిగతంగా కలవడమే వాట్సాప్ ద్వారా మెసేజ్‌లు పంపిస్తున్నారు. ఇంకొందరు సమావేశాలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల్లో యువ, మహిళా న్యాయవాదుల ఓట్లు కీలకం కానున్నట్లు తెలుస్తోంది. బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి ఎస్.వెంకటగుప్తా, తొండపు వెంకటేశ్వరరావు, విజయ రాఘవ, ఉపాధ్యక్ష పదవికి ఎస్.కే.జానీమియా, విజయశాంత, రవిప్రసాద్, ప్రధాన కార్యదర్శి పదవికి గద్దల దిలీప్, తెల్లాకుల రమేష్‌బాబు, క్రీడా కార్యదర్శి పదవికి కే.వీ.వీ.లక్ష్మి, రాందాస్‌నాయక్, గ్రంథాలయ కార్యదర్శిగా కళ్యాణి, రాంబాబు పోటీ పడుతున్నారు. ఇక సంయుక్త కార్యదర్శి, కోశాధికారిగా మేకల నవీన్, నరసింహారావు, మహిళా ప్రతినిధిగా ఇందిర ఇప్పటికే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా, ఎన్నికల గడువు సమీపిస్తుండడంతో అభ్యర్థులు ప్రచారంలో జోరు పెంచారు. మొత్తం 816 మంది న్యాయవాదులు ఓటు హక్కు వినియోగించుకోనుండగా విజయం వరిస్తుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

280 జీపీల్లో నూరు శాతం పన్నుల వసూలు


నేలకొండపల్లిలో ఉద్యోగులకు సూచనలు చేస్తున్న డీపీఓ ఆశాలత

నేలకొండపల్లి: జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో వంద శాతం పన్నుల వసూలు లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) పి.ఆశాలత తెలిపారు. నేలకొండపల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేసిన ఆమె రికార్డులను పరిశీలించాక మాట్లాడారు. జిల్లాలోని 579 జీపీల్లో రూ.15.80 కోట్ల పన్నుల డిమాండ్ ఉండగా.. రూ.14 కోట్లకు పైగా(89శాతం) వసూలయ్యాయని తెలిపారు. మొత్తంగా 280 జీపీల్లో నూరు శాతం పన్నులు వసూలవడంతో ఈనెలాఖరు నాటికి వంద శాతం లక్ష్యం సాధిస్తామని చెప్పారు. అవసరమైతే ప్రభుత్వ భవనాలకు నోటీసులు అందించి వసూలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. కాగా, తాగు నీటికి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలని, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా కంచెలు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. తొలుత డీపీఓ కార్యాలయంలో ఈఓ చాంబర్‌కు రాగా, కుర్చీలకు దుమ్ము పట్టి ఉండడంతో కార్యాలయ నిర్వహణ ఇలాగేనా అంటూ అసహనం వ్యక్తం చేస్తూ శుభ్రం చేయించారు. ఎంపీఓ సీ.హెచ్.శివ, పంచాయతీరాజ్ డీఈఈ వంశీ తదితరులు పాల్గొన్నారు.

మూడు యూనిట్లు.. 257దరఖాస్తులు


బోనకల్‌లో ఆందోళన నిర్వహిస్తున్న దివ్యాంగులు

అందరికీ రుణాలు ఇవ్వాలని దివ్యాంగుల నిరసన

బోనకల్: దివ్యాంగుల స్వయం ఉపాధి పథకాల కోసం మండలానికి కొద్దిసంఖ్యలో యూనిట్లు కేటాయించగా పెద్దసంఖ్యలో దరఖాస్తులు రావడంతో ఎంపిక ప్రక్రియ క్లిష్టంగా మారింది. ఈక్రమంలోనే బోనకల్ మండలానికి రూ.50వేల విలువైన మూడు యూనిట్లు కేటాయిస్తే ఆన్‌లైన్‌లో 257మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం జరిగిన సమావేశంలో ఎంపీడీఓ రమాదేవి, ఐసీడీఎస్ సీడీపీఓ బాల త్రిపురసుందరి ఆధ్వర్యాన డ్రా ద్వారా ముగ్గురిని ఎంపిక చేశారు. ఈనేపథ్యాన మిగతా వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న సమయాన అందరికీ రుణాలు ఇస్తామని చెప్పి ఇప్పుడు ముగ్గురినే ఎంపిక చేయడం సరికాదని మండిపడ్డారు. దీంతో ఖమ్మం – బోనకల్ రహదారిపై బైఠాయించగా సీపీఎం నాయకులు కిలారు సురేష్, తెల్లాకుల శ్రీను, గుగులోతు నరేష్ తదితరులు సంఘీబావం తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.

నేలకొండపల్లిలో ఒకటే...

నేలకొండపల్లి: నేలకొండపల్లి మండలంలో దివ్యాంగుల కోసం ఒకటే యూనిట్ కేటాయించగా 180 మంది దరఖాస్తు చేసుకున్నారు. మంగళవారం నిర్వహించిన డ్రాకు 124 మంది హాజరయ్యారు. వీరిలో లాటరీ ద్వారా ముగ్గురిని ఎంపిక చేసి ఖరారు చేసేందుకు జిల్లా యంత్రాంతానికి పంపినట్లు అధికారులు తెలిపారు. సీడీపీఓ కవిత, ఎంపీడీఓ ఎం.యర్రయ్య, ఎంపీఓ శివ, సూపర్‌వైజర్ లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెంకు చెందిన బి.బిక్షం(45) ఇంట్లో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కొంతకాలం క్రితం ఆయన కొడుకు, భార్య వివిధ కారణాలతో మృతి చెందారు. అప్పటి నుంచి మానసికంగా వేదనతో కుంగిపోతన్న బిక్షం ఉరి వేసుకున్నాడు. ఘటనపై ఆయన మరో కుమారుడి ఫిర్యాదుతో రఘునాథపాలెం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.

చెట్టును బైక్ ఢీకొని వ్యక్తి మృతి

సత్తుపల్లిరూరల్: బైక్‌పై వెళ్తున్న వ్యక్తి రోడ్డు పక్కన చెట్టును ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు... సత్తుపల్లి మండలం కిష్టారానికి చెందిన పత్తిపాటి వినోద్‌కుమార్(32) కొంతకాలంగా బొగ్గు రవాణా లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన మంగళవారం బైక్‌పై యాతాలకుంట వైపు వెళ్తుండగా చెరుకుపల్లి శివారు అటవీ ప్రాంతంలో చెట్టును ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, వినోద్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రూ.2.35లక్షల విలువైన సొత్తు చోరీ

సత్తుపల్లిరూరల్: తాళం వేసి ఉన్న ఇంట్లో చొరబడిన దుండగులు సొత్తు అపహరించుకెళ్లారు. మండలంలోని సదాశివునిపేటకు చెందిన కాలినేని రాజేష్ మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి వెళ్లారు. మంగళవారం ఉదయం వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు చేరుకుని పరిశీలించారు. ఇంట్లోని బీరువాలో భద్రపర్చిన రూ.2 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, రూ.35వేల నగదు చోరీ గురయ్యాయని రాజేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో లారీడ్రైవర్ బీభత్సం

పెనుబల్లి: పెనుబల్లి మండలం లంకాసాగర్ క్రాస్ వద్ద మద్యం మత్తులో లారీ నడిపిన డ్రైవర్ బీభత్సం సృష్టించాడు. కంటైనర్ లారీ సత్తుపల్లి వైపు నుండి ఖమ్మం వైపు వెళ్తుండగా.. డ్రైవర్ మద్యం మత్తులో ఉండడంతో మంగళవారం మధ్యాహ్నం అదుపు తప్పి లంకాసాగర్ వద్ద సెలూన్ షాపును ఢీకొట్టాడు. ఈ ఘటనలో షాపు కొంత మేర ధ్వంసం.. షాప్ నిర్వాహకుడు భోజనానికి వెళ్లడంతో ప్రమాదం తప్పినట్లయింది.

రూ.30వేలు స్వాహా చేసిన ఆన్‌లైన్ కేటుగాళ్లు

తల్లాడ: ఇంటి దగ్గరే ఉంటూ సులభంగా డబ్బు సంపాదించొచ్చని వచ్చిన మెసేజ్‌ను నమ్మిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సైబర్ నేరస్తుల చేతిలో మోసపోయాడు. తల్లాడ మండలం నారాయణపురానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వాట్సప్‌కు సోమవారం గుర్తుతెలియని నంబర్ నుంచి మెసేజ్ వచ్చింది. ఈమేరకు తక్కువ డిపాజిట్ చేస్తే ఎక్కువ డబ్బులు వస్తాయని నమ్మబలికారు. తొలుత రూ.వెయ్యి చెల్లిస్తే రూ.1,500 చెప్పగా, ఆ తర్వాత రూ.5వేలకు రూ.6 వేలు, రూ.20 వేలకు రూ.30 వేలు వస్తాయని నమ్మించారు. దీంతో ఆయన రూ.30,300 ఫోన్ పే ద్వారా చెల్లించగా.. మరో రూ.89 వేలు చెల్లించాలని సూచించారు. ఈమేరకు ఆయన తనకు అదనపు డబ్బు అవసరం లేదంటూ చెల్లించిన డబ్బు ఇవ్వాలని సూచించడంతో యాప్ నుంచి డిలీట్ చేశారు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన ఆయన 1930 నంబర్‌కు సమాచారం ఇవ్వడమే కాక తల్లాడ పోలీస్‌స్టేషన్‌లోనూ మంగళవారం ఫిర్యాదు చేశాడు.

ఇరువర్గాలపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురంలో ఘర్షణకు దిగిన ఇరువర్గాలపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పాతకక్షల నేపథ్యాన కొప్పుల సైదులు అదే గ్రామానికి చెందిన బల్లెం వెంకటేశ్వర్లు అసభ్య పదజాలంతో దూషించుకుని చంపుతామని బెదిరించారు. దీంతో ఇరువర్గాల ఫిర్యాదుతో కేసులు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

మహిళను వేధిస్తున్న ఘటనలో...

మండలంలోని ప్రొద్దుటూరుకు చెందిన ఇద్దరిపై కేసు నమోదైంది. గ్రామానికి చెందిన కమతం మరియన్న పెద్ద కుమార్తె మహేశ్వరిని ఏడాదిన్నర క్రితం గొర్రెముచ్చు శ్రీనివాసరావు వివాహం చేసుకున్నాడు. అప్పటినుంచి ఆమెను శారీరకంగా, మానసికంగా వేధిస్తుండడంతో తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఈక్రమాన శ్రీనివాసరావు, బుర్రి యశ్వంత్ ఈనెల 21న మరియన్న ఇంటికి వచ్చి అసభ్య పదజాలంతో దూషించి చంపుతామని బెదిరించారు. దీంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'రాజీవ్ యువవికాసం' మార్గదర్శకాలు విడుదల

రూ.50వేల యూనిట్లకు వంద శాతం సబ్సిడీ

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ యువతకు ఆర్థిక భరోసా కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈమేరకు పథకం మార్గదర్శకాలను విడుదల చేశారు. రూ.50వేల లోపు విలువైన యూనిట్‌కు వంద శాతం సబ్సిడీ, రూ.50వేలు – రూ.లక్ష వరకైతే 90 శాతం సబ్సిడీ, 10శాతం రుణం, రూ.1,00001 నుంచి రూ.2లక్షల విలువైతే 80 శాతం సబ్సిడీ, 20 శాతం రుణం అందనుంది. ఇక రూ.2లక్షల నుంచి రూ.4లక్షల విలువైన యూనిట్లకు 70 శాతం సబ్సిడీతో పాటు 30 శాతం బ్యాంక్ రుణం మంజూరవుతుంది. అభ్యర్థులకు గ్రామీణ ప్రాంతాల వారైతే రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలలోపు ఆదాయం ఉన్న వారిని అర్హులుగా ప్రకటించారు. 21–25ఏళ్ల లోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చని, వ్యవసాయ సంబంధిత పథకాలకు మాత్రం 60ఏళ్ల వరకు అర్హులుగా ప్రభుత్వం వెల్లడించింది. కాగా, రేషన్‌కార్డు లేని వారు ఆదాయ ధ్రువీకరణ పత్రం జత చేయాలని సూచించారు.

వీరికి ప్రాధాన్యత...

ఒక ఇంట్లో ఒకరికే అవకాశముంటుందని మార్గదర్శకాల్లో వెల్లడించారు. మహిళా అభ్యర్థులు, ప్రధానంగా ఒంటరి, వితంతవులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. అలాగే, 5శాతం దివ్యాంగులకే కాక తెలంగాణ ఉద్యమం, ఎస్సీ వర్గీకరణ ఉద్యమాల్లో అసువులు బాసిన వారి కుటుంబ సభ్యులకు యూనిట్ల మంజూరులో ప్రాధాన్యత కల్పిస్తారు. జిల్లాస్థాయి కమిటీ చైర్మన్‌గా కలెక్టర్, కన్వీనర్‌గా డీఆర్‌డీఓ, సభ్యులుగా అదనపు కలెక్టర్, పరిశ్రమల శాఖ జీఎం, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల ఈడీలు, మైనార్టీ సంక్షేమ శాఖాధికారి, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏఈ, డబ్ల్యూఅండ్‌సీడీ శాఖ పీడీ, గిరిజన సంక్షేమ శాఖ డీటీడీఓ, లీడ్ బ్యాంకు మేనేజర్ సభ్యులుగా వ్యవహరిస్తారు. కాగా, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాక అన్ని పత్రాలతో ఏప్రిల్ 5లోగా ఎంపీడీఓ కార్యాలయాల్లో అందజేయాలి. ఆపై అభ్యర్థుల గుర్తింపు, బ్యాంక్ లింకేజీ కార్యక్రమాలు ఏప్రిల్ 6నుంచి మే 20వ తేదీ వరకు పూర్తిచేస్తారు. అనంతరం మే 21నుంచి 31వ తేదీ వరకు స్క్రూటినీ అనంతరం లబ్ధిదారులను ప్రకటించి జూన్ 2నుంచి 8వ తేదీ వరకు మంజూరు ఉంటుంది.

పెద్దాస్పత్రిలో పనిచేయని ఏసీలు

వలు విభాగాల్లో ఇదే పరిస్థితి



పీడియాట్రిక్ ఐసీయూలో పనిచేయని ఏసీ (ఇన్‌సెట్) చిన్నారుల వార్డులో..

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని పలు విభాగాల్లో ఏసీలు సక్రమంగా పనిచేయడం లేదు. ఇందులో చాలావరకు పాతవి కావడంతో మొరాయిస్తుండగా, ఎన్నిసార్లు మరమ్మతు చేయించినా అదే పరిస్థితి పునరావృతమవుతోంది. జనరల్ ఆస్పత్రితో పాటు మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో కలిపి 120 వరకు ఏసీలు ఉండగా అందులో సుమారు 100 మేర పనిచేయడం లేదు. ప్రస్తుతం మధ్యాహ్న సమయంలో 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదవుతుండడంతో చికిత్స కోసం వచ్చిన వారు ఇబ్బంది పడుతున్నారు. గర్భిణులు, చిన్నారుల వార్డుల్లో ఈ పరిస్థితి తీవ్రంగా ఉంటోంది. చివరకు మిల్క్ బ్యాంక్‌లోనూ అన్ని ఏసీలు పనిచేయని కారణంగా సేవలో ప్రభావం పడుతోందని సిబ్బంది చెబుతున్నారు. ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ ఆస్పత్రికి కొత్త ఏసీలు కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

వాల్వ్ లీకేజీతో నేలవాలిన వరి


నీరు చేరిన పొలంలో రైతులు


తల్లాడ: మండలంలోని వెంగన్నపేటలో మిషన్ భగీరథ పైపులైన్ వాల్వ్ లీకేజీ ఏర్పడగా వరి పంటలోకి నీరు చేరి నేలవాలింది. గ్రామ సమీపాన మంగళవారం మిషన్ భగీరథ పైపులైన్ వాల్వ్ లీకేజీ జరగడంతో సుమారు 50 ఎకరాల్లో కోతకొచ్చిన వరి పైరులోకి వరదలా నీరు చేరింది. దీంతో పైరు నేలవాలగా రైతులు కన్నీరుమున్నీరయ్యారు. కనకగిరి గుట్టల నుండి సత్తుపల్లి వైపు నీరు సరఫరా చేసేందుకు రోడ్డు పక్కగా వేయాల్సిన పైపులను పొలాల మధ్యలో నుంచి వేయడంతో ఇలా జరిగిందని వాపోయారు.

సికిల్‌సెల్ బాధితులకు యూడీఐడీ కార్డులు


సమావేశంలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి, అధికారులు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో సికిల్‌సెల్‌తో బాధపడుతున్న వారి వివరాలు సేకరించి దివ్యాంగులుగా సర్టిఫికెట్లు(యూడీఐడీ కార్డులు)జారీ అయ్యేలా చేడాలని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి సూచించారు. జిల్లా ప్రధాన ఆస్పత్రి, పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల వైద్యులు, లాబ్ టెక్నీషియన్లు, ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ఉపాధ్యాయులకు మంగళవారం ఖమ్మంలో సికిల్‌సెల్ అనీమియాపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ సికిల్ సెల్ అనీమియా వారసత్వంగా వచ్చే జన్యుపరమైన రక్త రుగ్మత అని తెలిపారు. ఇప్పటివరకు 87,448 మంది గిరిజనులకు పరీక్షలు చేయగా వ్యాధి ఉన్న వారిని గుర్తించి చికిత్స అందిస్తున్నామన్నారు. వీరికి సదరమ్ సర్టిఫికెట్(యూనిక్ డిజేబిలిటీ ఐడెంటీ కార్డ్) జారీ చేయనున్నట్లుతెలిపారు. అనంతరం సికిల్‌సెల్ నోడల్ ఆఫీసర్ వెంకటరమణ,అదనపు డీఎంహెచ్‌ఓ సైదులు, ప్రోగ్రాం అధికారులు చందునాయక్, రామారావు మాట్లాడగా స్టేట్ సికిల్ సెల్ ట్రెయినర్లు మధువరన్, గణేష్‌నాయక్ సర్వే చేయాల్సి తీరు, వ్యాధి లక్షణాలను వివరించారు. వివిధ విభాగాల ఉద్యోగులు ఎస్.సుబ్రహ్మణ్యం, సాంబశివరెడ్డి పాల్గొన్నారు.

ఖమ్మంలో తెరుచుకున్న మధ్య గేట్


గేట్ మీదుగా వచ్చివెళ్తున్న వాహనాలు

ఖమ్మం రాపర్తినగర్: మూడో రైల్వే లైన్ పనుల కారణంగా నెలల తరబడి మూసి ఉంటున్న ఖమ్మంలోని రైల్వే మధ్య గేట్ ఎట్టకేలకు తెరుచుకుంది. నెలలుగా గేట్ మూసి ఉండడంతో జిల్లా కేంద్రంలో ప్రధానమైన గాంధీ చౌక్, కమాన్ బజార్ మధ్య వ్యాపార లావాదేవీలు మందగించాయి. అలాగే, ప్రజల రాకపోకలకు ఇక్కట్లు ఎదురయ్యాయి. దీంతో సమస్యను ఎంపీ రవిచంద్ర ఇటీవల రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లారు. గేట్ తెరిపించడమే కాక శాశ్వత పరిష్కారానికి బ్రిడ్జి నిర్మించాలని కోరారు. దీంతో అండర్ పాస్ మంజూరుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులకు సూచించిన మంత్రి.. ఆలోగా గేటు తెరవాలని ఆదేశించారు. దీంతో గేట్ తెరిచి మంగళవారం నుంచి రాకపోకలకు అనుమతించడంతో వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.